www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 ఆగస్టు 2023

ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలి

ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో యల్లారెడ్డి

రాజంపేట అర్బన్ : ర్యాగింగ్ అనే భూతాన్ని తరిమేసి విద్యార్థులు సోదరీ, సోదర భావంతో మెలగాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, డీన్ సుబ్బారావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ చిన్న బాబు తెలియజేశారు. బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆదేశాల మేరకు 'యాంటీ ర్యాగింగ్ డే'ను పురస్కరించుకొని విద్యా ర్థులకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, యాంటీ ర్యాగింగ్ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అభినందించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను బహుకరించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి : కలెక్టర్

రాజంపేట : పులపత్తూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పులపుత్తూరులో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పులపుత్తూరులో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల వేగవంతం కోసం క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులపుత్తూరులో ఇళ్ల నిర్మాణాల పూర్తిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి త్వరగా బిల్లులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీధివీధికి వాటర్ కనెక్షన్ ఇచ్చారా అని గ్రామస్తులను కలెక్టర్ ఆరా తీయగా పైపులో నీళ్లు లీకేజీ అవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. లీకేజీ లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాత్కాలిక పనులు చేయకుండా శాశ్వతమైన పనులు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో స్లాబ్ వేసే సమయంలో ఇంజినీర్ అసిస్టెంట్ అక్కడే ఉండి నాలుగు వైపులా అర అడుగు స్లాబ్ వేసేలా చూడాలన్నారు. ఆర అడుగు వేయడానికి రూ.పది వేలు అదనంగా శాంక్షన్ చేశామన్నారు. కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకొని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం కాంట్రాక్టర్‌కు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి,గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య, తహశీల్దార్, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంగంపేట లే అవుట్‌లో సదుపాయాలు

రైల్వేకోడూరు(ఓబులవారిపల్లి): మంగంపేట నిర్వాసితుల పునరావాస కల్పనలో భాగంగా లే అవుట్‌లో సకల సదుపాయాలు కల్పిస్తామని గిరీష తెలిపారు. మండలంలోని మంగంపేట నిర్వాసితుల పునరావాస కల్పనలో భాగంగా ఆర్‌ఆర్ 5 లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంగంపేట నిర్వాసితుల పునరావాస కల్పనలో భాగంగా హరిజనవాడ ఆర్‌ఆర్ 5 లేఅవుట్‌ను విజిట్ చేసి గ్రామస్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో సిసి రోడ్లు, డ్రెయినేజీ, పార్కు, స్కూల్, తదితర సకల సదుపాయాలను కల్పిస్తామని చాలా మంచి లేఅవుట్‌ని గ్రామస్తులకు తెలియజేశారు.

విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి-గాలివీడు

విద్యుత్తు ట్రూ ఆఫ్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై బాదుడు ఆపాలని తెలిపారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.లక్షల కోట్లు ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సంస్కరణల బిల్లును రద్దు చేయాలన్నారు. రూ.18 లక్షల వ్యయంతో పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. గాలి, నీరు తర్వాత విద్యుత్తు ప్రజల నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. 1948 నుంచి విద్యుత్ కంపెనీ చట్టం, విద్యుత్ బోర్డు ఏర్పడి నో లాస్, నో గేయిన్ విధానంతో ప్రజలకు విద్యుత్తు సౌకర్యాలు, సేవా దృక్పథంతో అందించాలన్నారు. మన దేశ రాజ్యాంగ నిర్మాతలు, సేవకులైన పాలకులు, ప్రభుత్వాలు నిర్ణయించారన్నారు. ప్రైవేట్ ఆపరేటర్ల ప్రయోజనాల కోసం 2003 సంవత్సరంలో విద్యుత్తు చట్ట సంస్కరణలు, పాలకులు స్వప్రయోజనాల కోసం తెచ్చారన్నారు. 2021లో ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో రూ.3,669 కోట్లు ప్రజల నుంచి ప్రభుత్వాలు వాడిన విద్యుత్ ఛార్జీల కన్నా ఎక్కువగా వసూలు చేశారన్నారు. సెల్ ఫోన్ చార్జీల లాగా ముందే, విద్యుత్ సంస్థలకు డబ్బు చెల్లిస్తేనే, విద్యుత్ సౌకర్యం అందించే పూర్తిస్థాయి కార్పొరేట్ వ్యాపార పద్ధతిని, 2022 విద్యుత్ సంస్కరణ బిల్లు పార్లమెంటులో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ రూపంలో, తీసుకొని వచ్చి ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విధానం దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిందని వారు విమర్శించారు. 2022 ఒక్క సంవత్సరంలోనే రూ.14 వేల కోట్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలు నుంచి వసూలు చేశారన్నారు. దేశంలోని సుమారు రూ.18 లక్షలకు పైగా ఉన్న వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తూ, గ్రామీణ ఆహార ధాన్యాల ఉత్పత్తిదారులైన వ్యవసాయదారులపై కూడా విద్యుత్తు బిల్లుల చార్జీలు వేసి ప్రజాధనాన్ని దొడ్డిదారిన పాలక ప్రభుత్వాలు దండుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పాలకులే నేరస్తులుగా మారుతున్న వైనం దేశంలో అలుముకుని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఆదాని, అంబాని కార్పొరేట్ కంపెనీలు విద్యుత్తు రంగాన్ని కైవసం చేసుకుని, కార్పొరేట్ సంస్థల కనుసన్నల్లో విద్యుత్తు రంగాన్ని పెట్టుకుని, 80 శాతం, 90 శాతం శాతం లాభాలను ఆర్జించడానికి, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వారి ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజా సంపదను, ప్రజాధనాన్ని, ప్రజా ప్రయోజనాలను, తాకట్టు పెడుతున్నదన్నారు. 2023లో ప్రజలపై రూ.3083 కోట్ల అదనపు భారం వినియోగదారులపై పడిందన్నారు. ఫిక్స్డ్ చార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రభుత్వాలు ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఓబులమ్మ, జిల్లా కమిటీ సభ్యులు జి.భోగేశ్వరయ్య, ఎం.లక్ష్మిదేవి, మండల అధ్యక్షులు ఎస్.భాస్కర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజా సంక్షేమం, అభివృద్ధే సిఎం లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మల్లెల గ్రౌండ్స్‌లోని పలు వీధుల్లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రజల ద్వారా స్థానిక సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల నిర్వహణలో ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, ఆటంకాలను సృష్టించినా ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం కోసం వాటిని ఎదుర్కొంటూ ముందుకు పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా, అమ్మఒడి, రైతు భరోసా, విద్యా, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, సామాజిక పెన్షన్లు వంటి కార్యక్రమాల అమలుకు ఆటంకాలు రాకుండా కేలెండర్ ప్రకారం వాటిని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలు కొనసాగాలన్నా, ఆశించిన మేరకు రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా 2024 ఎన్నికల్లో మనం తిరిగి వైసిపిని గెలిపించుకోవాలని, జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథ్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, వైస్ ఎంపిపిలు హరితా వెంకటరమణ, నెల్లూరు వెంకటాచలపతి, మండల కో-ఆప్షన్ సభ్యులు రెడ్డిబాష, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వైసిపి యువ నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, ఉదయ్, అతిక షఫీ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పకడ్బందీగా ఇంటింటి ఓటరు సర్వే : ఆర్‌డిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మురళి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటింటికీ ఓటర్ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని మదనపల్లి ఆర్‌డిఒ ఎం.ఎస్ మురళి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సూపర్వైజర్లు, బిఎల్ఒలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటింటి సర్వేని పకడ్బందీగా నిర్వహిస్తే, ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతానికి వెళ్ళిన వారు, మరణించిన వారు, చిరునామా మారిన వారిని గుర్తించాలని పేర్కొన్నారు. సూపర్వైజర్లు, బిఎల్ఒలు సమన్వయం చేసుకొని ఈ జాబితాను రూపొందించాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నాయకులకు ఏవైనా సమస్యలు ఉంటే సంబంధించిన బీఎల్ఓలను సంప్రదించాలని, అదేవిధంగా పార్టీకి సంబంధించిన ఒక ప్రతినిధిని ఈ సర్వేకి నియమించుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇంటింటా సర్వేని విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, మహబూబ్ పీర్, జనసేన పార్టీ నాయకులు జంగాల శివరాం,బిఎల్వోలు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గీత

చట్టాల అమలు తప్పనిసరి

- న్యాయమూర్తులు గీత, ప్రదీప్‌కుమార్

ప్రజాశక్తి-రాయచోటి రూరల్

బాలల న్యాయ చట్టం తప్పనిసరిగా పటిష్టంగా అమలు చేయాలని డిస్ట్రిక్ లెవెల్ కన్సల్టేషన్ మీటింగ్ న్యాయ సేవా సదన్ జడ్జి జి.గీత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ప్రదీప్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో జువెనైల్ జస్టిస్ కమిటీ సిఫార్సులపై చైల్డ్ వైరుధ్యానికి సంబం ధించిన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ చట్టం, పిల్లల నేరాల నివారణ, సైకాలజిస్టతో కౌన్సెలింగ్, మళ్లింపు, నిర్బంధానికి ప్రయత్నాలు, నాన్ కస్టడీ ప్రయత్నాలు, పిల్లల పునరావాసం, పునరుద్ధరణ పద్ధతులు, న్యాయమైన విచారణ, పిల్లల స్నేహపూర్వక విధానాలకు హక్కు, వృత్తి నైపుణ్య కోర్సులు, మందుల దుర్వినియోగం, నేర బాధ్యత యొక్క కనీస వయస్సు, క్రిమినల్ మెజార్టీ వయస్సు మొదలగు అంశాలను చర్చించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.భార్గవి, రాయచోటి అడిషనల్ ఎస్పీ డాక్టర్ వి.బి.రాజ్ కమల్, కడప దిశ డిఎస్‌పి ఎస్.రమాకాంత్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.ఆర్.సుభాష్ యాదవ్, సైకాలజిస్ట్ పి.వి.సునీత, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.పద్మావతి, పి.నిత్య కుమార్, ఇ.శిరీష, చెన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకట రాముడు పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

ఈ నెల 26న పీలేరులో జరిగే మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పీలేరులో జరిగిన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో 26న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే జాబ్ మేళాలో 20 మెగా కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. 18 నుంచి 27 ఏళ్ల లోపు వయస్సు కలిగిన 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ మొదలగు డిగ్రీలు చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వైసిపి నాయకులు రాకేష్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, హుమయూన్, షాజహాన్, రమేష్‌రెడ్డి, ఆతిక షఫీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

మాట్లాడుతున్న పంజం సుకుమార్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- రైతు సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయం లాబదాయకమని రైతు సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ప్రతి మహిళా గ్రామసంఘానికి ఒక (ఎన్‌పిఎం షాప్) ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని రైతులకు అందుబాటులో ఏర్పాటు చేయించడంలో మండలానికి సంబంధించి మొదటగా పంజం సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అనంతరాజుపేట వివో 2, 3, 4, 5లలో ప్రకృతి వ్యవసాయ ఎన్‌పిఎంషాప్‌లను ఏర్పాటు చేశారు. జడ్‌పిటిసి రత్నమ్మ, ఎంపిటిసి మల్లికార్జున, పంజం వేణు గోపాల్‌రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొని పరిశీలించారు. గ్రామంలో అందుబాటులో ఉండే విధంగా ఇన్నొవేషన్ బిల్డింగ్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ బి.ఉషారాణి బాధ్యతలు చేపట్టి ప్రాక్టికల్‌గా ఘన జీవామృతముని తయారు చేసి చూపించి, ఆ గ్రామంలో కిచన్ గార్డెన్స్ కిట్స్‌ని, కాయగూరల నారుని గ్రామములో పంపిణీ చేయించి 20 సెంట్లలో ఏటీఎం మోడల్, 5 లేయర్ మోడల్, ఏ గ్రేడ్ మోడల్ ని వేయించడంపై మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అందరూ పాటించే విధంగా అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. అనంతరాజుపేట పంచాయతీలో అవగహన కార్యక్రమాలు చేపట్టి 4 ఎన్‌పిఎం షాప్‌లు ఏర్పాటు చేయించిన యూనిట్ ఇన్‌ఛార్జి విఒ సిబ్బందికి సన్మానలతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మహిళ సభ్యులు, ఐసి ఆర్‌పిలు, మధు, నాగరాజు, సుబ్బలక్ష్మి, కళ్యాణి, మధు, గంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన బుధవారం కళాశాలలో పేద విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ చేశారు. 50 మందికి యూనిఫామ్ వితరణ చేయడం జరిగిందని తెలిపారు. కళాశాలకు విద్యార్థినులకు అండంగా నిలిచిన ఆర్యవైశ్య సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి అన్నిరంగాల్లో రాణించాలన్నారు. సంఘ సంస్కర్తలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

యూనిఫాం వితరణ చేస్తున్న బాలకృష్ణమూర్తి

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-పీలేరు

దేశంలో కులమతాల పేరిట జరుగుతూన్న దాడులను నాయకులు ఎందుకు అరికట్టలేకపోతున్నారని మాల మహానాడు నాయకులు ప్రజా ప్రతినిధులను ప్రశ్నించారు. బుధవారం పీలేరు మండల మాలమహానాడు కార్యాలయంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పురుషుల పుట్టుక కారణమైన మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ, హత్యలు, అత్యాచారాలు చేస్తుంటే, ప్రధాని మొదలు రాష్ట్ర ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేల వరకు కూడా ఎందుకు ఖండించే పరిస్థితిలో లేరని అన్నారు. స్వతంత్ర భారతదేశంలో దళితులు, క్రైస్తవులు, మైనారిటీలపై కులం, మతం పేరిట దాడులు, దమనకాండలు జరుగుతున్నా స్పందించని పాలకులకు జాతీయ జెండా తాకే అర్హత కూడా లేదని చెప్పారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి నగరిమడుగు సుబాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం రాస్తూ రిజర్వేషన్లు 10 సంవత్సరాల కాలం అమలు చేయాలని చెప్పి 76 ఏళ్లు దాటినా వాటిని సరైన పద్ధతిలో అమలు చేయకపోవడంవల్లే దళితుల పరిస్థితి నేటికీ అగమ్య గోచరంగా మారిందని తెలియజేశారు. పాలకుల తీరు మార్చుకుని, అన్ని వర్గాల ప్రజలతో పాటు ప్రధానంగా దళిత, గిరిజన వర్గాల పక్షాన వారి అభివృద్ధికి దోహదపడే విధంగా పరిపాలన జరపాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున

నేటి నుంచి 'గండి'లో శ్రావణమాసోత్సవాలు

నాలుగు శనివారాలపాటు ప్రత్యేక పూజలు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు

ప్రజాశక్తి -చక్రాయపేట

పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన గండిక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి శ్రావణ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈనెల 17 నుంచి అంగరంగవైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అసి స్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఆలయ చైర్మన్ పినుబోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల 19న మొదటి, 26న రెండవ, సెప్టెంబర్ 2న మూడవ, 9న నాల్గవ శ్రావణ శనివారాల్లో ఉత్సవాలుంటాయన్నారు.

విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న ఆలయం

ఎత్తైన కొండల నడుమ పాపాఘ్ని..

. ఆలయానికి సమీపంలోనే సుమారు 2 వేల అడుగుల ఎత్తైన కొండల నడుమ పాపాఘ్ని నది ప్రవహిస్తూ ఉంటూంది. ఈ సుదర దృశ్యం పలువురిని ఆకట్టుకుంటోంది. గండి క్షేత్రం తీర్థాలలో పాపాఘ్ని తీర్థం అతి పవిత్రంగా భావిస్తారు. దత్త మండలాలు ఉన్నప్పుడు కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో విదేశీ యువకుడైనా, భారతీయ సంస్కృతి గురించి అవగాహన లేకపోయినా పవిత్ర హృదయుడుగా ఉండేవారు. అందుకే అతనికి గండి క్షేత్రంలోని స్వర్ణ విజయతోరణం దర్శనం ఇచ్చిందని పలువురు పేర్కొంటున్నారు. .

అలవలపాటి ముకుందరెడ్డి

పాపాఘ్ని నదిలో స్నానాలు ఆచరించి అంజన్నను దర్శిస్తే మంచిదంటారు. పాపాఘ్ని నది కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నందిగాను పుట్టి సుదీర్ఘంగా అనంతపురం జిల్లాలో వ్యాపించి చిత్తూరు జిల్లా నుంచి కడప జిల్లాలోకి చేరి పాపాకిలోకి ప్రవహించిన గండి అంజన్న పాదాల వద్ద ప్రవహిస్తూ సంగమేశ్వర వద్ద పెన్నా నదిలో అంతర్భాగమవుతుందని చరిత్ర చెబుతోంది.

గండి అంజన్న క్షేత్రానికి చేరుకోవాలంటే..

గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకోవాలంటే తిరుపతి నుంచి పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మీదుగా గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. అలాగే కర్నూలు నుంచి వచ్చే భక్తులకు కడప మీదుగా వేంపల్లి, రామాపురం ,లక్కిరెడ్డిపల్లి, చక్రాయపేట, మీదుగా గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. అనంతపురం నుంచి వచ్చే వారికి పులివెందల మీదుగా వేంపల్లి, గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. జమ్మలమడుగు నుంచి ప్రొద్దు టూరు, ఎర్రగుంట్ల, వేంపల్లి మీదుగా గండికి చేరుకోవచ్చు. ప్రతి ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి కూడా తండోపతండాలుగా అత్యధిక సంఖ్యలో యాత్రికులు శ్రావణ మాసంలో ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి వస్తున్నారు.

స్వామివారి అలంకరణకు తమిళనాడు రాష్ట్రం అంబూరు నుంచి ప్రత్యేక పూల అలంకరణ చేయించారు. ఆలయం, పరిసర ప్రాం తాల్లో ప్రత్యేక విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. యాత్రికులకు సౌకర్యంగా క్యూలైన్లు, తాగునీరు, దాతలచే నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. స్నానం చేయడానికి నదిలో బోర్లు వేయించి షవర్లు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను టిటిడి వారి సౌజన్యంతో ఒక పెద్ద జర్మని షెడ్డు నిర్మించారు. మొబైల్ టాయిలెట్లు, చలువ పందిళ్లు, పోలీస్ అవుట్‌పోస్టు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలు కల్పించారు. యాత్రికుల కాలక్షేపానికి పౌరాణిక నాటకాలు, భరతనాట్యం, తోలుబొమ్మలాటలు, చెక్కభజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. వేంపల్లె వైపు నుంచి వచ్చే యాత్రికులకు వీరన్నగట్టుపల్లె నుంచి, రాయచోటి నుంచి వచ్చే వారికి అద్దాల మర్రిక్రాస్ నుంచి గండి క్షేత్రానికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

గండిలో అంజన్న పంచముఖ విగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దస్తగిరి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి : ఎంపిపి

ప్రజాశక్తి-కురబలకోట

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో అర్హులైన లబ్దిదారులకు అందుతున్నాయా లేదో గుర్తించాలని ఎంపిడిఒ దస్తగిరి పిలుపునిచ్చారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ అధికారులకు ప్రజాప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి ఆదేశానుసారం 23 నుంచి ప్రతి గ్రామసచివాలయ పరిధిలోని అన్ని గ్రామాలు పర్యటించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పనితీరును పరిశీలించాలని కోరారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయతీలలోని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు అందరూ సమన్వయం చేసుకొని ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామ నాగిరెడ్డి, భూదేవి, ప్రత్యేక ఆహ్వానితుల బైసాని చంద్రశేఖర్ నాయుడు, ఆర్.వి.కె చైర్మన్ శివశంకరరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న కలకడ మండల సమావేశం

ప్రజాశక్తి-కలకడ

మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీవిద్య రవికుమార్ అధ్యక్షతన మండల సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

వికసించిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో రెండుచోట్ల అరుదుగా కనిపించే బ్రహ్మ కమలాలు వికసించాయి. పట్టణం లోని మదనపల్లి రోడ్డు ఇందిరమ్మ కాలనీలో రచయిత దివంగత పోల్లి రామకృష్ణ ఇంటిలో సుమారు 40 బ్రహ్మ కమలాలు విరబూశాయి. సంవత్సరంలో మూడు సార్లు మాత్రమే ఈ పూలు వికసి స్తాయని బ్రహ్మకమలాలు మా ఇంట వర్ధ వికసించడంఆనందంగా హర్షం వ్యక్తం చేశారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు

ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలను విరమించుకోవాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు జరిగి మూడు నెలలైనా కాలేదని, జీతాల సమస్య ఇంకా పరిష్కారమే కాలేదన్నారు. జీతాలు సకాలంలో అందక ఉపాధ్యాయులు పడుతుంటే సర్దుబాటు అంటూ ప్రభుత్వం చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. జిఒ నెంబర్ 117 పేరుతో నిరంతరం ఇలా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వలన విద్యా వ్యవస్థ గందరగోళంగా తయారవుతుందన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు కావాలని తాము కోరితే, ప్రతి పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దుబాటు చర్యలను ఉపసంహరించుకోకపోతే ఎస్‌టియు తరపున పోరాటాలకు సిద్ధమవుతామని,ఇప్పటికైనా ఇలాంటి విధానాలని విడనాడాలని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ఉత్కంఠ భరితంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ కార్యాలయ క్రీడా మైదానంలో షంషేర్ షటిల్ గ్రూప్ అధ్యక్షులు పిఇకె.మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పది టీమ్‌లు పాల్గొన్నాయి. హీరాసింగ్, అభినవ్, ఫరూక్, మస్తాన్ డబుల్స్ ఫైనల్‌కు చేరారు. వీరిద్దరి మధ్య ఫైనల్ పోటీ అత్యంత ఆసక్తికరంగా కొనసాగింది. చివరకు ఫరూక్, మస్తాన్ విజయం సాధించారు. విజేతలకు కడప ఎస్ఐ శ్రీధర్ బహుమతులను అందించారు. ఈ పోటీలలో నిమ్మకాయల మోహన్, టీవీఎస్ షోరూం సాయి, అఖిల్ ,దినేష్, షబ్బీర్, తేజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇమ్యునైజేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ సృజన

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి-నందలూరు

సంవత్సరంలోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి సృజన పేర్కొన్నారు. బుధవారం నందలూరు సచివాలయం-1 లోని సాధారణ ఇమ్యునైజేషన్ సెషన్‌ను ఆమె సందర్శించారు. వ్యాధి నిరోదక టీకా ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఫీల్డ్ సిబ్బందికి, తల్లితండ్రులకి, గ్రామస్తులకి రోగ నిరోధక టీకాలు పిల్లలకి వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకట్ నారాయణ, ఎంఎల్ హెచ్‌పి ఆరిఫ్ బాబు, ఎంపిహెచ్ఎ లక్ష్మయ్య, ఎఎన్ఎం శాంత కుమారి, అంజనమ్మ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి, వసతిగృహాల్లో బుధవారం మెలథిన్ ద్రావణాన్ని పిచికారి చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోసువారిపల్లె పిహెచ్‌సి, వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానిక బిసి బాలుర వసతిగృహం, ఎస్‌టి, గురుకుల పాఠశాల, కస్తూర్బా, మోడల్ స్కూల్ పాఠశాలల్లో హాస్టల్లో దోమ నివారణ మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.దోమ తెరలను వాడాలని తెలిపారు. జ్వరం వస్తే వైద్యులను సంప్రదించలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణా నాయక్, సూపర్వైజర్ అమరావతి, ఎఎన్ఎంలు కుతిజ,కవిత పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, MADANAPALLI.

O.S.No. 291/2022

S.Guru Santhaiah Reptd.by G.P.A.Holder K.RamaChandra. ...**Plaintiff**

Vs

1. S.Sarada
2. G.Radhamma ...**Defendants**

SUMMONS TO 2ND DEFENDANT

G.Radhamma, W/o G.Vijaya Sankar, D.No.9-124, Thalla Subbanna Colony, Ranga Reddy Colony, Madanapalli Post & Town, Annamayya Dist.

వాది- ప్రతివాదులైన మీ ఇరువురిపైన పై కోర్టు నందు దావాను దాఖలు చేయడం జరిగింది. అందులో 2వ ప్రతివాది అయిన నీవు కోర్టు నుండి వచ్చు దావా సమన్లును అందు బాటులో వుండి కూడా తీసికోనందున సదరు సమన్లును 2వ ప్రతివాది అయిన నీకు పత్రికాముఖంగా తెలియజేస్తూ నీ హాజరు నిమిత్తం 22.8.2023 నాటికి వాయిదా వున్నది. నీవు ఆరోజు ఉ॥ గం॥ 10.30 లకు పై కోర్టు నందు హాజరు కావలెను. లేనంతట నీ పరోక్షమున కేసును తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

G. JANARDHANA REDDY, B.A.,B.L.,

Advocate for Plaintiff, MADANAPALLI.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గ్రామాలలో అభివృద్ధిని చేపట్టడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసిపి నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంగళవారీ కురవపల్లి, వెంగళవారిపల్లి, నాగంవారిపల్లి, పెద్దరాజులపల్లి, బోడిబండ, గంగాపురంపల్లి లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపిపి నరసింహులు, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ.రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, స్థానిక వైసిపి నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతి లబ్ధిదారులను పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించారు. జగనన్న పాలనలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అండగా నిలపడ్డాయని అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో 98 శాతం హామీలను నెరవేర్చిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మాట ఇచ్చాడంటే అది తప్పక నెరవేరుస్తాడని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా, అర్హత ప్రామాణికంగా తీసుకుంటూ సంక్షేమ పథకాలను జగనన్న అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు దళారీ వ్యవస్థలను, అవినీతిని పెంచి పోషించారని, ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందాలంటే ముడుపులు చెల్లించుకునే పరిస్థితి ఆనాడు ఉండేదన్నారు. జగనన్న పాలనలో దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, ఎక్కడా కూడా అవినీతికి తావు లేకుండా సచివాలయ, వాలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసి పేదలకు సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలోకే జమ చేయిస్తున్నారని తెలిపారు. పజలకు ఏ అవసరం ఉన్నా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలకు మంచి చేసే వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, మహాదేవ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, నాయకులు శేషాద్రి రెడ్డి, నవీన్, నరేంద్ర రెడ్డి, శశిధర్ రెడ్డి, సివి రమణారెడ్డి, హేమంత్, నాగరాజా, గోపాలకృష్ణ, హెూటల్ రఫీ, శంకర, గంగాధర, రవి, మహేష్, తహశీల్దార్ మంజుల, ఎంపిడిఒ శేషగిరిరావు, డిటి సిరాజుద్దీన్, మండల సర్వేయర్ మురళి నాయక్, ఎఇలు వసంత రెడ్డి, హరినాథ్‌రెడ్డి, అమర్నాథ్, ఎపిఒ రమేష్, ఎస్ఐ రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

విలువలతో కూడిన సంస్థ 'మానవత'

ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-సుండుపల్లె

సమాజంలో విలువలతో కూడిన సంస్థ మానవత కు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని ఆ సంస్థ కేంద్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు తెలిపారు. మండల కేంద్రమైన సుండుపల్లె మానవతా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కేంద్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సంస్థ ఆపదలో వున్న పేదలు, విద్యార్థుల కోసం చేయూత నివ్వడం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుతం నూట ఒక్క మానవతా స్వచ్ఛంద సంస్థ శాఖలు ఏర్పడ్డాయని తెలిపారు.వీటి పరిధిలో ఉచితంగా ఫ్రీజర్ బాక్సులు,శాంతి రథాలు అవసరమైన వారికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుండుపల్లెలో నూతన కార్యవర్గం అధ్వర్యంలో సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించి ప్రజలలో గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర, జిల్లా కమిటీల ప్రతినిదులు సహదేవరెడ్డి, రమాంజులురెడ్డి, సాంబ శివారెడ్డి, వెంకట్రమణనాయుడు, బ్రంహానందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సుండు పల్లె మండల నూతనకమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష,కార్యదర్శులుగా కృష్ణంరాజు, రెడ్డెప్పనాయుడు, కోశాధికారిగా రవీంద్రనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రానాయక్, సహాయ కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి, విద్య, అత్యవసరం, వైద్య, చైతన్య ప్రతినిధులుగా ఆరిఫుల్లా, గణపతి, శివకుమార్, హరికుమర్ నూతనంగా కమిటీ కి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

వార్డు ఉప ఎన్నిక ప్రచారంలో వాలంటీర్లు : టిడిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి-2 వార్డుకు ఉప ఎన్నిక ప్రచారంలో వైసిపి నాయకులతో కలిసి వాలంటీర్లు ఇంటింటా ప్రచారం చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్ఆర్ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లిలోని 2వ వార్డు ఉప ఎన్నికల్లో వాలంటీర్లతో వైసిపి నాయకులు ఉపసర్పంచ్ రాజారెడ్డి తో కలిసి ఇంటిట ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వార్డ్ మెంబర్ ఓటు వేయకుంటే సంక్షేమ పథకాలు రద్దవుతాయని ఓటర్లను భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. కేవలం 300 ఓటర్లు ఉన్న వార్డు మెంబర్ గెలుపు కోసం ఎన్ని అక్రమాలు చేస్తున్నారని సాధారణ ఎన్నికల్లో ఇంకెన్ని దౌర్జ న్యాలకు పాల్పడతారని విమర్శించారు. వీరిపై వెంటనే చర్యలు తీసుకొని వార్డు ఉప ఎన్నిక ప్రశాంతంగా జరిపించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకుడు ఆర్ నాగేంద్రరెడ్డి, అన్వర్‌బాషా, రవీంద్రారెడ్డి, గంగయ్య, ఇస్మాయిల్, మాజీ సర్పంచ్, మన్సూర్ గౌస్‌బాషా, నవాజ్, చాంద్ బాషా పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాలాడి ప్రభాకర్ రెడ్డి

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి గంగాధర్‌రావు

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్‌పి గంగాధరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా అన్నమయ్య-సత్యసాయి జిల్లా సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ క్వాటర్స్‌ను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎస్ఐ గాయత్రిని అభినందించారు. అనంతరం పలు కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

'మిట్స్' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజి నీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గుంజి శ్రీనివాసులుకు తమిళనాడు లోని భారతీయార్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. 'ఆన్ అడాప్టివ్ రిసోర్సు షెడ్యూలింగ్ మోడల్ ఫర్ ఇంజినీరింగ్ టాస్క్ ఎగ్జిక్యూషన్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్' పై చేసిన పరిశోధనలకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లుగా తెలిపారు. గుంజి శ్రీనివాసులుని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కల్పన, అధ్యాపకులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

డాక్టరేట్ పొందిన శ్రీనివాసులు

విద్యాసామగ్రి పొందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని పిచ్చలవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయురాలు రమాదేవి తన భర్త బెజవాడ రఘుపతిజ్ఞాపకార్థంతో విద్యార్థులకు రూ.10వేలు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు జీవి. ప్రసాద్ మాట్లాడుతూ కురబలకోట మండలం నలసానివారిపల్లి పాఠశాలలో 2001 నుంచి 2009 వరకు ఉపాధ్యాయురాలుగా అత్యుత్తమ సేవలు అందించారని కొనియడారు. విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పించారని అన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విద్యాసామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందేలా చర్యలు : ఎస్ఇ

ప్రజాశక్తి - ముద్దనూరు

విద్యుత్ అంతరాయాన్ని తగ్గించి ప్రజలకు, రైతులకు నిరంతరమూ నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉప్పలూరు విద్యుత్ ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఉప్పలూరు ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉంటుందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరించి నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని గ్రామస్తులు, రైతులు కోరారు. విద్యుత్ అంతరాయానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ పంట పొలాల రక్షణ కోసం విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకోవడం వల్ల కొంత అంతరాయం ఏర్పడుతున్నట్లు సిబ్బంది తెలిపారు. పొలాలకు విద్యుత్ కంచె ఏర్పాటు చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై, కంచె అరికట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం, ఒరిగిన స్తంభాలు, లూజుగా ఉన్న లైన్లు యుద్ధ ప్రాతిపదికన సరి చేయాలని చెప్పారు. ప్రజలకు విద్యుత్ సమస్య ఏర్పడితే పరిష్కరం అయ్యేంతవరకు సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహించి, పనిచేయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన భద్రతపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు నియంత్రించి ప్రజలకు అవసరమైన పద్రేశంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పగటి వేళ వీధిలైట్లు వెలగకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు పరిశీలించారు. కార్యక్రమంలో డిఇ శ్రీనివాసులరెడ్డి, డిఇలు సుబ్రహ్మణ్యం, శేషగిరిబాబు,ఎఇ శ్రీనివాసరాజ వర్మ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసిని పరామర్శించిన భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు మాజీ ఎంపిటిసి వడ్డెమాను పుల్లారెడ్డిని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి బుధవారం పరామర్శించారు. 20 రోజులుగా అనారోగ్య కారణాల వల్ల కడపలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జయ్యారు. ఆయన స్వగ్రామమైన సుంకెసులకు వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఇన్‌ఛార్జి చదివిరాళ్ల జయరామిరెడ్డి, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

18న వాహనాలకు వేలం పాట

జమ్మలమడుగు :వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు వేలంపాట నిర్వహిచంనున్నట్లు జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్. లత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న జమ్మలమడుగు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిటెండెంట్ బి. శ్రీనివాస్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు, ఏదైనా ప్రూఫ్ తీసుకొని వేలంలో పాల్గొనవచ్చన్నారు.

నిజాయితీకి మారుపేరు 'కోట్ల'

వేంపల్లె : నీతికి నిజాయితీకి మారు పేరు మాజీ సిఎం కోట్ల విజయ భాస్కర్ రెడ్డినని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి 103వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాయర్‌గా, రైతుగా, క్రీడాకారుడుగా, రాజకీయ నాయకుడిగా, పరిపాలనాదక్షుడిగా కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి రాణించారని చెప్పారు. ఆయన వ్యక్తిత్వం హిమాలయాల వలె ఉన్నతమైంది అన్నారు. కోట్లాది రూపాయలు సంపాదించకపోయిన పోయిన కోట్లాది మంది అభిమానులను విజయ భాస్కర్ రెడ్డి సొంతం చేసుకునాన్రి చెప్పారు. పదవులకే గొప్ప వన్నె తెచ్చిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, బద్రి, రామకృష్ణ, నరసింహారెడ్డి, వేమయ్య, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎలక్ట్రీషియన్ యూనియన్ నాయకులు

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బ్రెయిన్ స్ట్రోక్ బాధితు డికి ఎలక్ట్రీషియన్ యూని యన్ నాయకులు ఆర్థికసాయం అందజేసి చేయూత నిచ్చారు. మండల పరిధిలో ఇసుకపల్లికి చెందిన ఎలక్ట్రీషియన్ శ్రీనివాసులు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కు గురై తిరుపతి పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. అన్నమ య్య ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వ ర్యంలో బుధవారం బాధితుడిని కలిసి రూ.16 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు కెవికెఎస్ వర్మ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎలక్ట్రీషియన్లకు తమ యూనియన్ అండగా ఉంటుందని అన్నారు. కేవలం ఎలక్ట్రీషియన్లకే కాక తమ యూనియన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని, కష్టాలలో ఉన్న వారికి చేయూతనిచ్చేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటా మని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తరుణ్ కుమార్, కార్యదర్శి సంజీవనాయుడు, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సభాధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, ఆర్గనైజర్ గంగయ్య, సభ్యులు గణేష్, అక్బర్‌పాల్గొన్నారు.

దేశాన్ని అమ్మకానికి పెట్టిన మోడీ : తులసిరెడ్డి

జమ్మలమడుగు : దేశాన్ని మోడీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో జమ్మలమడుగు అసెంబ్లీ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం రాహు కేతువు లాగా దాపురించాయని వాపోయారు. 1947 నుంచి 2014 వరకు 67 ఏళ్ల నెహ్రూ మొదలుకొని మన్మోహన్ సింగ్ వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం రూ. 46 లక్షల కోట్లు అప్పు చేయగా, 2014 నుంచి 2023 వరకు కేవలం 9 ఏళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం రూ. 109 లక్షల కోట్ల అదనంగా అప్పు చేసిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను మోడీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని, విమా నాశ్రయాలు రైల్వేస్టేషన్‌లో ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసి లాంటి సంస్థలను అమ్మకానికి పెట్టిందని అన్నారు.జమ్మలమడుగు అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులుగా సుబ్రహ్మణ్యేశ్వర సుబ్రహ్మణ్యం శర్మ, సుబ్బారావు, ఓబయ్య, జయరాం రెడ్డి, కృష్ణారెడ్డి, యేసయ్య, పుష్ప రాజు, సులోచనమ్మను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానకిరామ్, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అరెస్టయిన ఎర్రచందనం స్మగ్లర్లతో ఎఫ్ఆర్ఒ, అటవీశాఖ సిబ్బంది

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- పది దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బాలుపల్లె రేంజ్ అటవీశాఖ పరిధిలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు బాలుపల్లె రేంజ్ ఎఫ్ఆర్ఒ టి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు బాలుపల్లి సెక్షన్‌లోని బాలుపల్లె వెస్ట్‌బీట్ పరిధిలో దాడులు నిర్వహించి తమిళనాడుకు చెందిన సడియన్ చిన్న ఆండే, నటేషన్, శ్రీనివాసన్ అనే ముగ్గురిని అదులోకి తీసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి లక్ష రూపాయలు విలువ చేసే పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డిఆర్ఒ ఎస్.చంద్రకళ, ఎఫ్ఎస్ఒ ఎం.బాల చంద్రుడు, ఎఫ్‌బిఒఆర్ సుబ్బలక్ష్మి, ఎం సుధాకర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రుక్సానా హత్య కేసులో మరొకరు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్ నగర్ ప్రాంతంలో జరిగిన రుక్సానా హత్య కేసులో మరొకరిని అఅరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలో ఈనెల 3న జరిగిన రుక్సానా హత్య కేసు దర్యాప్తులో భాగంగా పట్టణంలోని సైదాపేటకు చెందిన పేరు షేక్ హుస్సేనీ కుమారుడు షేక్ మౌలా అలియాస్షేక్ ఇమ్రాన్(23)ఇతను మృతురాలు రుక్సానా కదలికలు గమనించి సులేమాన్‌కు తెలిపేవాడని చెప్పారు. హత్య జరిగిన అనంతరం ఇతను హైదరాబాదుకు పారిపోయాడని సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు...

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని చింతకుంటవాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ మల్లికారుజనరెడ్డి తెలిపారు. బుదవారం చింతకుంటపల్లె సమీపంలో కొంత మంది జూదమాడుతుండగా అందిన సమాచారం మేరకు దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని అరవపల్లె తోటపాలెంలో నివాసముండే పాణ్యం సుబ్రహ్మణ్యం వ్యక్తి ఇంట్లో 77 గ్రాముల బంగారం నగలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అబ్దుల జహీర్ తెలిపిన వివరాల మేరకు..సుబ్రమణ్యం కుటుంబ సమేతంగా సోమవారం తిరుత్తనికి వెళ్తూ ఇంటి తాళాలు బయటే చెట్టు వద్ద ఉంచి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం తిరిగి రాగా గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలో దాచి ఉంచిన నగలు చోరీ చేసినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని తెలిపారు. డిఎస్‌పి చైతన్య, సిఐ పుల్లయ్య, ఎస్ఐ అబ్దుల్‌జహీర్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వివరాలు సేకరించారని అన్నారు. బయట వ్యక్తులు చోరీ చేయలేదని బాగా తెలిసినవారే చోరీ చేశారని త్వరలోనే వారిని పట్టుకుంటామని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ పుల్లయ్య, ఎస్ఐ జహీర్